# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఓటింగ్

- నారాయణపేటలో 99.51 శాతం పోలింగ్
- ఓటు వేసిన పేట, మక్తల్ ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, జెడ్పీ చైర్ పర్సన్ వనజ



ఓటు వేసేందుకు వస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన కౌన్సిలర్లు



పోలింగ్ సరళిని పరిశీలించడానికి వస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి





ఓటు వేస్తున్న పేట, మక్తల్ ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి

నారాయణపేట రూరల్, మార్చి 28 : ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో భాగంగా గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఓటింగ్ కేంద్రంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, వైస్‌చైర్మన్ సురేఖ రెడ్డి, వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు మొత్తం 205 మంది ఓటర్లకు గానూ 204మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో మక్తల్ మండలం మంతన్‌గోడ్ గ్రామానికి చెందిన బీజేపీ ఎంపీటీసీ సుమిత్రమ్మ తన ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. దీంతో పేట జిల్లాలో 99.51శా తం పోలింగ్ జరిగినట్లు ఎనకల అధికారులు పేర్కొన్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, నారాయణపేట మాజీ ఎమ్మె ల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పోలింగ్ ముగిసే వరకు పోలింగ్ కేంద్రం వద్ద ఉండి బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపునకు తీవ్రంగా కృషి చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించగా 10 గంటలకు 27. 80 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 59.02 శాతం, రెండు గంటలకు 95.12శాతం పోలింగ్ జరిగింది. కాగా ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ మద్దతుదారులను నాలుగు రోజులు కిందట క్యాంపులకు తరలించారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లను నేరుగా వాహనాల్లో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ పర్యవేక్షించారు. అలాగే పేట డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం పోలింగ్‌కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఓటు హక్కును వినియోగించుకొంటున్న పేట ఎంపీటీసీలు

## ఓటింగ్‌లో పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు



ఓటింగ్ అనంతరం మాజీ ఎమ్మెల్యేలతో ఎంపీటీసీలు

ఊట్కూర్/మక్తల్ టౌన్/నర్వ, మార్చి 28 : మండల జెడ్పీటీసీ సభ్యుడితో పాటు 16మంది ఎంపీటీసీ సభ్యులు జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఓటింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ఓటింగ్‌లో పాల్గొన్న జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు రవిప్రసాద్‌రెడ్డి, కోరం పద్మ, రవికుమార్, జయమ్మ, భీమమ్మ, జ్యోతి, షహనాజ్‌బేగం తదితరులను మక్తల్, నారాయణపేట మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌రెడ్డి అభినందించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం మక్తల్ నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, మక్తల్ మున్సిపల్ కౌన్సిలర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిని పోలింగ్ కేంద్రానికి మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తీసుకొని వెళ్లారు. నర్వ మండలంలోని 13 మంది ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీలు గురువారం నారాయణపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలం నుంచి ఎంపీపీ జయరాములు, వైస్ ఎంపీపీ వీణావతి శంకర్, జెడ్పీటీసీ జ్యోతి కిరణ్ ప్రకాశ్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొద్ది రోజులుగా క్యాంపునకు తరలి వెళ్లిన ఎంపీటీసీలు నేరుగా ఎన్నికల పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా బీఆర్ఎస్ పార్టీ సభ్యులు అధికంగా ఉన్నారు.

### ఓటు వేసిన పుర చైర్మన్

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 28: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా గురువారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ తాటిగణేశ్, కౌన్సిల్ సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.



మక్తల్ టౌన్ : నారాయణపేటలో ఓటు వేసేందుకు వెళ్తున్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు

## జడ్చర్ల బార్ అసోసియేషన్ ఎన్నిక



జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య

జడ్చర్ల, మార్చి 28 : జడ్చర్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొంకల జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జడ్చర్ల బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ 28వ తేదీతో ముగిసింది. అయితే బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శితో పాటు అన్నిపోస్టులకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్‌లు వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యక్షుడిగా యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాపోతుల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా శ్రీశైలం, లైబ్రరీ సెక్రటరిగా ఎండీ.అమీనోద్దిన్, స్పోర్ట్స్ కార్యదర్శిగా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శ్రీకాంత్, రఘురాం, సయ్యద్ అఫీసాను ఎన్నుకున్నారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా మజర్ అహ్మద్, లైబ్రేరియన్‌గా ఫజాజ్ హైమద్ తాచీలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి కృష్ణగౌడ్ నూతన కమిటీ సభ్యులకు పత్రాలు అందజేశారు.

### నారాయణపేటలో..

నారాయణపేట టౌన్, మార్చి 28: పట్టణంలోని జిల్లా కోర్టులో గురువారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దామోదర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవి కోసం దామోదర్‌గౌడ్, న్యాయవాదులు మల్లికార్జున్, రఘువీర్ యాదవ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల్లో దామోదర్‌గౌడ్‌కు 45 ఓట్లు, రఘువీర్ యాదవ్‌కు 10 ఓట్లు, మల్లికార్జున్‌కు మూడుఓట్లు పోలయ్యాయి. దీంతో అధ్యక్షుడిగా దామోదర్‌గౌడ్ రెండోసారి ఎంపికయ్యారు. అదేవిధంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నందూనామాజీ, ప్రధాన కార్యదర్శిగా చెన్నారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా భీంరెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్, స్పోర్ట్స్ ఈ సందర్భంగా అధ్యక్షుడు దామోదర్ గౌడ్, కార్యదర్శి చెన్నారెడ్డికి నాయకులు గోపాల్, బాల్ రాం, మహేశ్‌కుమార్‌గౌడ్ మిఠాయిలు తినిపించారు.

### మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 28: మహబూబ్‌నగర్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి గెలుపొందారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నిక కొనసాగింది. ఈ ఓటింగ్ ప్రక్రియలో న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రామన్నాథ్‌గౌడ్, కోశాధికారిగా శివరాజ్, ఉపాధ్యక్షుడిగా శ్రీరామ్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా నాగోజి, గ్రంథాలయ కార్యదర్శిగా కేస్ మల్లిఖార్జున్, కార్యవర్గ సభ్యులుగా కరుణకాంత్, ఇలియాస్ హుస్సేన్, నరేందర్ నాయక్, నరేశ్‌గౌడ్, రమేశ్, సాహితీ శివానంద్, ఉత్తమ్ కుమార్, వినోద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## రైలుకింద పడి వ్యక్తి దుర్మరణం

ఊట్కూర్, మార్చి28: మద్యం మత్తు, ఆపై చెవిలో ఇయర్ ఫోన్స్ ఓ వ్యక్తి మృతికి కారణమయ్యాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున ఊట్కూర్ మండలం ఎడవెల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం ప్రకారం ఎడవెల్లి ఎస్సీ కాలనీకి చెందిన డోల్ దేవప్ప (30) తాపీ మేస్త్రీల వద్ద రోజువారి కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 5గంటల సమయంలో మద్యం మత్తులో చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకొని గ్రామ శివారులోని రైలు పట్టాలపైకి వెళ్లి పడుకున్నాడు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి రాయిచూర్ వైపు గూడ్స్‌రైలు వెళ్లడంతో తల భాగం ఛిద్రమై ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

## ఓటర్లలో చైతన్యం తేవాలి

పాలమూరు, మార్చి 28: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత డైట్ కళాశాలలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్వీప్ ఆదేశాల మేరకు పోస్టర్ మేకింగ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైతన్య పరచడానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌సుమన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనేలా ఛాత్రోపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. పోస్టర్ల ద్వారా ప్రజల్లో ఆసక్తికర అంశాలను వెలుగులోకి తీసుకురావచ్చని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థులు రూపొందించిన చార్జులను, పోస్టర్లను ఒక్కొక్కటిగా పరిశీలించి వారిలో కళాప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా. మహమ్మద్ మెహరాజుల్లాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ డా.షేక్‌లియార్‌అలీ, సూపరింటెండెంట్ రామకృష్ణరావు, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

హన్వాడ మార్చి 28 : మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన విష్ణు సీఆర్పీఎఫ్ జవాన్. గుండెపోటుతో మృతి చెందినట్లు గురువారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. విష్ణు కోల్‌కతా బార్డర్‌లో విధులు నిర్వహిస్తుండగా బుధవారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈయన విధుల్లో చేరి రెండేండ్లు కావస్తున్నది. ఇంటికి పెద్దకొడుకును కోల్పోవడంతో విష్ణు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. రేపు సాయంత్రం పార్థివదేహాన్ని స్వగ్రామానికి తేనున్నారని గ్రామస్తులు తెలిపారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన ఉండాలి

భూత్పూర్, మార్చి 28 : కుష్ఠువ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే నివారణ చర్యలు చేపట్టవచ్చని జిల్లా లెప్రసి ప్రోగ్రాం ఆఫీసర్ జరీనా అన్నారు. భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన ఆశవర్కర్లు గ్రామాల వారీగా ఇదివరకే వైద్య పరీక్షలు నిర్వహించి, కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న మొత్తం 80 మంది ఉన్నట్లు గుర్తించారు. వారికి కుష్ఠువ్యాధి పరీక్షలు చేశామని, వారిలో ఎక్కువ మందికి చర్మవ్యాధులే ఉన్నట్లు డాక్టర్ జరీనా తెలిపారు. అవసరమైన వారికి వ్యాధి నివారణ మందులు అందజేసి, తీసుకోవాల్సిన జాగ్రతలు, పాటించాల్సిన పద్ధతులపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో లెప్రసి అధికారులు నర్సింహారెడ్డి, హనుమంతరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అయూబ్‌ఖాన్, సూపర్‌వైజర్లు యాదమ్మ, సుధాకర్, హెల్త్‌అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

## రక్తదానం ప్రాణదానం

పాలమూరు, మార్చి 28: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శీతాకాల శిబిరంలో భాగంగా గురువారం హస్నాపూర్‌లో చివరి రోజు ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.సత్యనారాయణగౌడ్, ఎన్ఎస్ఎస్ అధికారులు రాఘవేంద్రరెడ్డి, స్వరూప స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, అధికారులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్, కోఆర్డినేటర్ ఈశ్వరయ్య, కంట్రోలర్ డా.రాములు, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు ఉన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి కృషి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి





ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 28 : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తున్నదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పద్మావతికాలనీలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ ముస్లిం అడ్వైజరీ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా అంతా కలిసి ఉండాలన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు, మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అంటేనే ప్రేమ, ఆప్యాయతలకు నిలయమన్నారు. పలువురు మతపెద్దలు మాట్లాడుతూ తమ ఆర్థిక సంపాదనలో కొంత మేర పేదలకు ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ గులాంగౌస్, ముస్లిం సంఘాల నాయకులు మతపెద్దలు సయ్యద్‌రజాక్‌ఖాద్రి, అవజ్‌బిన్‌బహియల్, మీర్‌షోయబ్‌అలీ, హాజీసలీం, ఖలీద్‌నవీద్, షేక్‌సిరాజుద్దీన్, ఇస్మాయిల్, ఖాజా మైనొద్దీన్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే విద్య లక్ష్యం

- సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజి ప్రసన్నకుమార్



వర్క్‌షాప్ కార్యక్రమంలో ప్రసన్నకుమార్‌తో పీయూ బృందం

పాలమూరు, మార్చి 28: పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పాలమూరు యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన నీటి అడుగుజాడలను తగ్గించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సోషల్ సైంటిస్ట్ డా.డబ్ల్యూజి ప్రసన్నకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ విద్య ఒక అసాధారణ అవకాశమని, కావలసిన అభ్యసన ఫలితాల ప్రకారం పాఠ్యప్రణాళికలను రూపొందించడం చాలా అవసరమన్నారు. అదేవిధంగా నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత జఠిలమైన సమస్య అయినా పర్యావరణ కాలుష్యాన్ని రూపుమాపాలన్నారు. క్లీన్ క్యాంపస్‌లు ఆరోగ్యకరమైన క్యాంపస్‌లు అని, నీటి వనరులలో నీరు ఉండాలని, మనం నీటిని తెలివిగా వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా అన్ని జీవులు బాధపడుతున్నాయని అన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ పద్మ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం విద్యార్థులు తరువాత ఉపాధ్యాయులుగా అనుభవ పూర్వక అభ్యసన పద్ధతులను అభ్యసిస్తారని, భవిష్యత్‌లో మంచి ఉపాధ్యాయులుగా రాణిస్తారని అన్నారు. అదేవిధంగా పర్యావరణ క్షీణతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు పర్యావరణ పరిరక్షణ గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల హెడ్ డా.జంగం విశ్వనాథం, డా. ఆంజనేయులు, వినోద్‌కుమార్, డా.విజయలక్ష్మి, జయనాయక్, వివిధ కళాశాలల నుంచి ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, దాదాపు 15మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నారాయణపేట టౌన్, మార్చి 28: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. గురువారం ఆయన ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. అధిక లాభాలను ఆర్జించాలని ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టరాదన్నారు. కొత్త వ్యక్తులు క్యూఆర్ కోడ్ పంపించి దానిని స్కాన్ చేస్తే డబ్బులు వస్తాయని చెప్పే మాటలను నమ్మరాదన్నారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోరాదన్నారు. ఆన్‌లైన్ లోన్ యాప్స్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసినప్పుడు వ్యక్తి గత సమాచారం అంతా వాళ్లు సేకరించడం జరుగుతుందని, లోన్ తిరిగి కట్టినా ఇంకా కట్టాలని వేధింపులకు చేస్తారన్నారు. లోన్ యాప్స్ వేధింపులకు గురైనప్పుడు క్షణికావేశాలకు పోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలపాలన్నారు. 1930 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. పండుగలకు షాపింగ్ చేసే సమయంలో లాటరీ కూపన్లలో వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదన్నారు. తెలియని నెంబర్ నుంచి వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌కు వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించరాదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు.

## పర్యావరణ పరిరక్షణే విద్య లక్ష్యం

పాలమూరు, మార్చి 28: పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం నీటి అడుగుజాడలను తగ్గించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడంపై వర్క్‌షాప్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పాలమూరు యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సోషల్ సైంటిస్ట్ డా.డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ విద్య ఒక అసాధారణ అవకాశమన్నారు. కావలసిన అభ్యసన ఫలితాల ప్రకారం పాఠ్యప్రణాళికలు రూపొందించడం చాలా అవసరమన్నారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత జఠిలమైన సమస్య పర్యావరణ కాలుష్యాన్ని రూపుమాపాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ పద్మ మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు పర్యావరణ క్షీణత– పరిరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో డా.జంగం విశ్వనాథం, డా.ఆంజనేయులు, వినోద్‌కుమార్, డా.విజయలక్ష్మి, జయనాయక్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## బయోడైవర్సిటీని పరిరక్షించడం అందరి బాధ్యత

పాలమూరు, మార్చి 28: మహబూబ్‌నగర్ స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం లైఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జీవన వైవిధ్య పరిరక్షణ, మానవ జీవితంపై దాని ప్రభావం అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ జువాలజీ అసిస్టెంట్ ప్రొ.హిరోజిరావుబోస్లే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఆవిర్భావం జరిగినప్పటి నుంచి కాలుష్యం పెరగడం వలన జీవన వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపింది. లైఫ్ అనగా ఎల్ఐఎఫ్ఈ కాదని, ఎడిజన, థైమిన్, గానిన్, సైటోసిన్ (ఏటీజీసీ)అనే రసాయన సమ్మేళనం అన్నారు. భూమిపై ప్రతి జీవజాతికి ఇదే మూలమన్నారు. అదేవిధంగా బయో డైవర్సిటీని పరిరక్షించడం మానవులందరికీ ఎంతో ముఖ్యమని, కాలుష్యాన్ని నివారించడం మొక్కలను పెంచడం అడవులను నరకకుండా కాలుష్యాన్ని నివారించడం వలన బయో డైవర్సిటీని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ ప్రదర్శన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## గుండె వైద్యశిబిరం విజయవంతం

- గుండె పరీక్షలు చేయించుకున్న 208 మంది చిన్నారులు



చిన్నారులకు గుండె పరీక్ష చేస్తున్న వైద్యులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 28: జిల్లాలో గుండె సమస్యలు ఉన్నావారికి ప్రభుత్వ జనరల్ దవాఖానలో ఉచితంగా గుండె పరీక్షలు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్ సహకారంతో ఆర్‌బీఎస్‌కే డీఈఐసీ సెంటర్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 0–18 పిల్లలకు ఉచిత కార్డియాక్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపును డీఎంహెచ్‌వో డా. కృష్ణ, దవాఖాన సూపరింటెండెంట్ డా. జీవన్ చేతుల మీదుగా ప్రారంభించారు. చిన్నపిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని, చిన్నారులకు టుడి ఈకో, ఈసీజీ, పలు పరీక్షలు చేశారు. ఇందులో 208 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 68 మంది గుండె సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శంకర్, కేర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రశాంత్ పాటిల్, డాక్టర్ దీపా, డాక్టర్ శతాబ్ది, డీఈఐసీ మేనేజర్ దేవిదాస్ జాదవ్, డా.విద్యా, డా.ప్రవీణ్, డీఈఐసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

- మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి



క్లాక్ టవర్ వద్ద అవగాహన కల్పిస్తున్న కళాజాత విద్యార్థులు

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 28 : ప్లాస్టిక్ రహిత పట్టణంగా మహబూబ్‌నగర్ పురపాలికను తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం క్లాక్‌టవర్, మార్కెట్, మెట్టుగడ్డ ఏరియాలో ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై అవగాహన కల్పించారు. మార్పు అనే అంశంపై ఎకో క్లబ్ విద్యార్థులు కళాజాత, నాటకప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానా విధిస్తున్నామన్నారు. ఉచితంగా జూట్, క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈనెల 30వరకు కళాప్రదర్శన ద్వారా అవగాహన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య విభాగ అధికారులు వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## జాతీయస్థాయి త్రోబాల్ జట్టుకు ఎంపిక

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 28 : మహారాష్ట్రలోని షిరిడీలో ఈనెల 29నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి త్రోబాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు రాజాపూర్‌కు చెందిన బాలకృష్ణ తెలంగాణ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాదత్‌ఖాన్, అహ్మద్‌హుస్సేన్ సంఘం సభ్యులు అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాక్షించారు.

## విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబర్చాలి

మరికల్, మార్చి 28 : విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబర్చాలని నారాయణ పేట షీ టీమ్ ఏఎస్సై శ్రీదేవి విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అడ్డుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులు కనబడితే 100 కు డయల్ చేయాలని సూచించారు.

## ఈజీఎస్ పనులు పరిశీలన

జడ్చర్ల, మార్చి 28: జడ్చర్ల మండలంలోని తంగెళ్లపల్లిలో చేపట్టిన ఈజీఎస్ పనులను గురువారం జడ్చర్ల ఎంపీడీవో బాల్‌రెడ్డి పరిశీలించారు. హాజరు రిజిస్టర్, మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాల్‌రెడ్డి మాట్లాడుతూ కూలీలు ఉదయం 8గంటల వరకు వచ్చి పనులు చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏపీవో విజయభాస్కర్ ఉన్నారు.

## కడుపునొప్పితో యువతి ఆత్మహత్య

రాజాపూర్, మార్చి 28: కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై రవి తెలిపిన వివరాలు.. మండలంలోని కుత్నేపల్లి గ్రామానికి చెందిన ఆర్.శేఖర్ కుమారుడు యోగేందర్ నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన ఆశవర్కర్ కూతురు ప్రియాంకను గత ఏడాది ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మండల కేంద్రంలో అద్దెఇంట్లో కాపురం ఉంటున్నారు. ప్రియాంక అప్పుడప్పుడు కడుపునొప్పితో బాధపడేది. బుధవారం నొప్పి భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటనపై తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రిటైర్డ్ ప్రొఫెసర్ మృతికి సంతాపం

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 28: జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్‌సిదాయత్‌అలీ గురువారం మృతి చెందారు. విద్యావేత్తగా, సామాజికవేత్తగా సేవా కార్యక్రమాలు చేట్టారు. ఆయన మృతి పట్ల వివిధ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## ద్విచక్రవాహనం దగ్ధం చేసిన వ్యక్తికి రిమాండ్

నవాబ్‌పేట, మార్చి 28: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన యువకుడు వడ్డె వినోద్‌కుమార్(21)ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన అప్పన్న తనద్విచక్ర వాహనాన్ని వారంక్రితం తన ఇంటిముందు నిలిపి ఉంచగా అదే గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ పాతకక్షల నెపంతో ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనపై అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వినోద్‌కుమార్‌ను జిల్లాజైలుకు తరలించామన్నారు.

## రుణాలు చెల్లించాలి

ధన్వాడ, మార్చి 28: సింగిల్‌విండో ద్వారా రుణాలు పొందిన రైతులు సకాలంలో తిరిగి చెల్లించాలని ధన్వాడ సింగిల్‌విండో అధ్యక్షుడు వై.వెంకట్‌రాంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ ధన్వాడకు రూ.50లక్షలు మంజూరయ్యాయని, రుణాలు అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రైతులు, సీఈవో ఉన్నారు.

## నర్సరీ పరిశీలన

మక్తల్ టౌన్, మార్చి 28: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు సరాసరి వేతనం అందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని నారాయణపేట డీఆర్‌డీవో రాజేశ్వరి అన్నారు. నర్సరీల పెంపకం తనిఖీల్లో భాగంగా గురువారం మక్తల్ మండలం లింగంపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరావు, రహమతుద్దీన్, ఏపీవో ఉన్నారు.

## పెండింగ్ కూలి డబ్బులు చెల్లించాలి

ధన్వాడ, మార్చి 28: మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీ చేసిన, చేస్తున్న కూలీలకు నెల రోజులుగా డబ్బులు చెల్లించడం లేదని మాజీ ఎంపీటీసీ గౌనిశ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలకు సరైన వసతులు కల్పించడం లేదని తెలిపారు.